క్లుప్తంగా

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బోనకల్: డాక్టర్ గోపినాథగాదె ఇన్నయ్య, జింజర్ల రమేష్‌లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.గిరి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉద్యమకారులపై నల్ల చట్టాలను ప్రయోగించి బెయిల్ రాకుండా అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమ కారులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.

నేత్రదానం


సత్యనారాయణ(ఫైల్)

సత్తుపల్లి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ముద్రగడ్డ సత్యనారాయణ(53) అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన మృతుడి నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

మధిర: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని చిలుకూరు గ్రామ సర్పంచ్ నిడమానూరు సంధ్య వంశీ తెలిపారు. చిలుకూరు బీసీ కాలనీలో దెందుకూరు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని తెలిపారు. ఇంటింటికి తిరిగి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మావతి, కౌసల్య, విజయ కుమారి, భారతి, లక్ష్మి, అరుణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న సభ్యులు

తల్లాడ: మండలంలోని పినపాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మేమున్నాము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సంస్థ గతంలో పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్, నోట్‌బుక్స్, పదో తరగతిలో మెరిట్ వచ్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ గందం వరుణ్ బార్గవ్, డోకుపర్తి మోహన్‌కృష్ణ, రంగా సాయికుమార్, ఎం.కిరణ్, చందా అక్షయ్, జయంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చెరుకూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమార్తె, అల్లుడు కాపా వరలక్ష్మి, వీరభద్రరావులు హరికృష్ణ ఆర్థిక సాయంతో ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన షెడ్డులో రెండు ఫ్యాన్లు వితరణగా అందించారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేంద్రరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, కట్ల సురేష్, జి.రామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తల్లాడ విద్యుత్ ఏఈ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేరుకే ఎర్రుపాలెం బస్టాండ్

ఒక్క బస్సు రాదు..

- దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండ్
- ఇప్పటికీ నిరుపయోగమే..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నిరుపయోగంగా మారిన ఎర్రుపాలెం బస్టాండ్

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నిర్మించిన బస్టాండ్ పేరుకే ఉంది. దశాబ్దాల క్రితం రూ.10 లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ పూర్తిగా శిథిలమైంది. ఒక్క బస్సు కూడా ఇక్కడకు రావడం లేదు.

బస్టాండ్ టూ రింగ్‌సెంటర్ మీదుగా విజయవాడకు నడిపితే..

ఈ బస్టాండ్ మధిర–విజయవాడ ప్రధాన రహదారి వెంబడి లేకపోవడంతో మధిర టూ విజయవాడ తిరిగే బస్సులు ఏవీ కూడా ఈ ప్రాంగణంలోకి రావడంలేదు. మధిర నుంచి వచ్చే బస్సులను బస్టాండ్ (అంబేడ్కర్ సెంటర్ మీదుగా) టూ రింగ్ సెంటర్ చేరుకుని విజయవాడకు వెళ్లే రీతిలో నడపాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

యాచకులకు ఆవాసంగా..

బస్‌స్టాండ్ ఉన్నప్పటికీ.. అది శిథిలం కావడంతో స్థానిక హోటల్స్‌ల్లో, రోడ్లపై నిరీక్షణ చేస్తున్నారు. దీంతో ఆ బస్టాండ్ యాచకులకు నిలయంగా.. రైతులు ధాన్యం ఆరబోసుకునే ప్రాంగణంగా మారింది. బస్టాండ్ స్థలం ఆక్రమణ కాకుండా ఉండేందుకు గానూ గత ప్రభుత్వ హాయంలో బస్టాండ్ ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం ఆర్టీసీ నిధులు మంజూరు చేయగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రహరీ నిర్మాణంతో పాటు బస్టాండ్‌లో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలకేంద్రంలోని మధిర టూ కంచికచర్ల ప్రధాన రహదారిలో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్‌ను నిర్మాణం చేయాలని, ఆమేరకు ఆర్టీసీ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటోలను ఆశ్రయిస్తున్నాం..



బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సిన వస్తుంది. ఏపీ, తెలంగాణా ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు రైళ్లల్లో ఎర్రుపాలెంకు చేరుకుంటారు. ఈ సందర్భంలో వారు ప్రయాణించడానికి ఆటోలో గత్యంతరం అవుతున్నాయి.ఇక్కడ నుండి పవిత్ర పుణ్యక్షేత్రం జమలాపురంకు ప్రతి నిత్యం భక్తులు పెద్ద ఎత్తున రాకపోలు కూడా సాగిస్తున్నారు. మధిర డిపో నుంచి కనీసం ఒక్క బస్సు ఇక్కడకు రావడం లేదు.

– షేక్ అమీర్,షోడా వ్యాపారి, ఎర్రుపాలెం

ప్రయాణికుల మొర ఆలకించాలి..



దశాబ్దాల కాలంగా బస్‌స్టాండ్‌కు బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల మొరను ఆర్టీసీ అధికారులు ఆలకించాలి. బస్టాండ్ ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో శిథిలమైంది. మధిర ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు వచ్చి రాకపోలు సాగిస్తే ప్రయాణికులకు మేలు జరుగుతుంది. అధికారులు ఈమేరకు చర్యలు తీసుకోవాలి.

– సామనూరి కృష్ణార్జునరాజు, మాజీ ఎంపీటీసీ, కంద్రిక

మంత్రులను కలిసిన నాయకులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను..


భట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వైరా: తెలంగాణ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వైరా మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భట్టిని కలిసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పల్లిపాడు కాంగ్రెస్ నాయకుడు రాంపూడి రోశయ్య, యూత్ నాయకులు పమ్మి అశోక్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొంగులేటిని..

ఏన్కూరు: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కలిశారు. కార్యక్రమంలో నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరావు, స్వర్ణ ప్రహ్లాదరావు, వర్దబోయిన నర్సింహరావు, అంగోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రులను కలిసిన ఎమ్మెల్యే..

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతిగా నూతనంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

తుమ్మలను కలిసిన సొసైటీ చైర్మన్..


మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సొసైటీ చైర్మన్

ముదిగొండ: వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు రైతుబంధు నగదు రైతుల ఖాతాల్లో అందరికి జమ చేస్తున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సాదు రమేష్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరగాలి


మధిర: ఆస్పత్రిలో కిట్ అందజేస్తున్న ఉద్యోగులు


ఎర్రుపాలెం: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పుష్పలత

మధిర/ఎర్రుపాలెం: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేందుకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని దెందుకూరు, బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీరాజ్, పుష్పలత తెలిపారు. శుక్రవారం మధిరలోని వైద్యాధికారి పృథ్వీరాజ్ విలేకరులతో మాట్లాడుతూ.. గడచిన వారం రోజుల్లో దెందుకూరు పీహెచ్‌సీలో నాలుగు సుఖ ప్రసవాలు జరిగాయని.. తల్లులు, శిశువులు క్షేమంగా ఉన్నారన్నారు. పిల్లలు పుట్టగానే టీకాలు వేయడం జరిగిందన్నారు. అదే విధంగా వైద్యాధికారిని పుష్పలత మండలంలోని పలువురి గర్భిణుల గృహాలకు వెళ్లి రిపోర్టులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ప్రభుత్వస్పత్రుల్లోనే సుఖప్రసవాలు జరుగుతాయని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించొద్దని తెలిపారు. ప్రైవేట్‌లో ఎక్కువగా ఆపరేషన్ చేస్తున్నారని, దీంతో ఆర్థిక భారంతో పాటుగా ఈ కార్యక్రమాలల్లో నర్సింగ్ ఆఫీసర్ రజిని, అనూష, సృజన, శ్రీనివాస్, వినీల, సీహెచ్‌ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ జి.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం స్నేహ, ఆశ కార్యకర్తలు విజయ, రమణ పాల్గొన్నారు.

శంకుస్థాపన


మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామసర్పంచ్ సురేష్

చింతకాని: మండలంలోని నాగిలిగొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామసర్పంచ్ చాట్ల సురేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, టెక్నికల్ అసిస్టెంట్ హుస్సేన్, గ్రామపంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు అలివేలు మంగమ్మ, లేయమ్మ, గ్రామపంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ వితరణ


దివ్యాంగురాలకి ట్రైసైకిల్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ సభ్యులు కొమిరిశెట్టి శ్రీధర్, పుష్పావతి దంపతుల కూతురు, అల్లుడు జవ్వాజి కృష్ణతేజ, సింధూజ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని జింకలగూడెం గ్రామానికి చెందిన షేక్ లాల్‌బీ అనే దివ్యాంగురాలికి లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో ట్రైసైకిల్ వితరణగా అందించారు. లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చింతల పూడి వెంకటేశ్వరరావు, కొమిరిశెట్టి శ్రీధర్, పుష్పావతి, వనమా విశ్వేశ్వరరావు, ముళ్లపాటి సీతారాములు, చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి సత్యం బాబు, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, శీలం పిచ్చిరెడ్డి, రామకృష్ణ, పుల్లారావు, వసంత తదితరులు పాల్గొన్నారు.


దుకాణంలో ఉన్న పలు రకాల క్రిస్మస్ స్టార్లు

క్రిస్మస్ సందడి..

సత్తుపల్లిటౌన్: ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సామగ్రి అమ్మకాలు మొదలయ్యాయి. క్రిస్మస్‌కు ముందుగా క్రైస్తవులు ఇంటిపై ఏర్పాటు చేసే క్రిస్మస్ స్టార్లు, వివిధ రకాలలో ఆకర్షణీయంగా ఉన్నాయి. అదే విధంగా క్రిస్మస్ అలంకరణ దండలు, ట్రీలు, క్రిస్మస్ తాత బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇళ్లతో పాటు చర్చీలలో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ముందుగానే సందడి నెలకొంటోంది.


క్రిస్మస్ ట్రీ అలంకరణ సామగ్రి

సర్దార్ పటేల్ వర్ధంతి వేడుకలు


బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండలంలో బీజేపీ అధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లమోతుల రమేష్, రెంటపల్లి నారాయణ, మోరబోయిన కృష్ణ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు

వైరా: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వైరాలోని పాత బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పలువురు పూల మాలలేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ ప్రముఖులు వనమా విశ్వేశ్వరరావు, భూమాత కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, రాయల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, శివశంకర్, సుమంత్, ఉదయ్‌తేజ, కిషోర్ ,అవినాష్, నిఖిల్, రాజ, కృష్ణవేణి, అన్నపూర్ణ, గీత, రోజా తదితరులు పాల్గొన్నారు.

నేరడ శివాలయం ప్రధాన అర్చకుడు మృతి

చింతకాని: మండలంలోని నేరడ గ్రామ శివాలయం ప్రధాన అర్చకుడు ఇంగువ విష్ణువర్ధన శర్మ (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన విష్ణువర్ధన శర్మ గత 60 ఏళ్లుగా శివాలయానికి అర్చకులుగా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, నేరడ గ్రామ ఉపసర్పంచ్ దూసరి గోపి, మాజీ సర్పంచ్ మంకెన రమేష్, గ్రామపెద్దలు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

స్వీట్లు పంపిణీ


స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎమ్మెల్యేగా డాక్టర్ మట్టా రాగమయి విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గ్యాస్‌గోడౌన్ ఏరియాలోని 17వ వార్డులో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, ఎండి కమల్‌పాషా, దూదిపాల రాంబాబు, మార్పుల్ రామకృష్ణ, చావా మధు, టోపి శ్రీను, వీరివాడ నాగభూషణం పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్టీసీ సూపర్‌వైజర్ బాలస్వామి

సత్తుపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారని ఆర్టీసీ సూపర్‌వైజర్ బాలస్వామి అన్నారు. సత్తుపల్లి మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలపై గ్రామదీపికలకు అవగాహన కల్పించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి, రత్నకుమారి, శ్రీనివాస్, కృష్ణయ్య, జనార్ధన్ రావు, నరరేందర్, సుజిత, నాగమణి, శ్రీదేవి, నాగమణి, సరోజిని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన తపాలా ఉద్యోగుల సమ్మె


సత్తుపల్లిలో రాస్తారోకో చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: మండలంలోని తపాలా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకి చేరింది. సత్తుపల్లిలో గ్రామీణ తపాల ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించి రింగ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సమ్మెకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ సంఘీభావం తెలిపారు. అనంతరం తహసీల్దార్ యోగీశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తపాలా ఉద్యోగులు మాట్లాడుతూ.. పేరివిజన్ కమిటీ కమలేష్ చంద్ర సానుకూల సిఫార్సులను అమలుచేసేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఎనిమిది గంటల పని కల్పించాలని, సీనియార్టీ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రాట్యుటీ పెంచాలని, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఉన్న అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ బ్రాంచ్ కార్యదర్శి బి.కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు, వి.మహేష్, మౌనిక, రమ్య, ఎన్‌యూజీడీఎస్ బ్రాంచ్ సెక్రటరీ, బి.నర్సింహారావు, సంజీవరావు, రామయ్య, జయరాజు, ఎస్‌డీ జానీ, కోటమర్తి వెంకటేశ్వరరావు, ఖాజాబి, పాషా, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట..


సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

కారేపల్లి: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట జీడీఎస్‌లో తపాలా ఉద్యోగులు సమ్మె వద్ద నినాదాలు చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రెండు దఫాలుగా సమ్మె చేయగా హామీలు ఇచ్చి అమలు చేయలేదని.. మూడోసారి హామీలు కాకుండా అమలు చేసే వరకు సమ్మె విరమించకుండా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో మౌలాలి, అహ్మద్, వెంకటేశ్వర్లు, రియాజ్, అచ్చారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


దుద్దెపూడి వాగులో ఏర్పడిన గోతులు

- చోద్యం చూస్తున్న అధికారులు
- వాల్టా చట్టానికి తూట్లు


ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

వేంసూరు: మండలంలోని దుద్దెపూడి తమ్మిలేరు వాగు, అడసర్లపాడు, రామన్నపాలెంలో కట్లేరు వాగులలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. రెవెన్యూ, పోలీసులు దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులు తమదైన శైలిలో దందాను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. మిచాంగ్ తుఫాన్‌తో తమ్మిలేరు, కట్లేరు వాగులకు భారీగా వరద రావడంతో పెద్ద ఎత్తున ఇసుక వచ్చింది. దీంతో ఇసుక వ్యాపారులు ఈ నీరు తగ్గాక తమదైన శైలిలో మళ్లీ అక్రమంగా ఇసుక తోలకాలు మొదలు పెట్టారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు సరిహద్దున ఉన్న ఆంధ్రా గ్రామాలకు సైతం సరఫరా చేస్తు మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తు రాత్రి, పగలు తేడా లేకుండ ఇసుకను తరలిస్తున్నారు.

ప్రభుత్వం మారినా దందా మారలే..

గత కొన్నేళ్లుగా అక్రమ రవాణా జరుగుతుందని ప్రభుత్వం మారిన ఇసుక దందా మారలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు తీసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇకనైనా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వం పేదలకు మంజూరు చేసే ఇళ్లకు ఇసుక కొరత ఏర్పడే అవకాశముందని.. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.